# వారసుడు

సెల్‌ఫోను మోగింది. అదే నెంబరు... అతడే!

ఫోన్ ఎత్తాను.

"బస్సు కదిలిందా...?" అతడు అడిగాడు.

"ఊఁ..."

"చెప్పింది గుర్తుందిగా... జాగ్రత్త..."

"ఊఁ..."

"ఆకు పచ్చ పెట్టె నీ సీటు కింద పెట్టుకో. లెదర్‌హ్యాండు బ్యాగు నీ వద్దే ఉంచుకో. నేను మళ్ళీ ఫోన్ చేస్తాను."

"ఊఁ..." సెల్‌ఫోన్ పాకెటులో పెట్టుకున్నాను.

బస్సు కదులుతోంది – నా ఆలోచనలు కూడా –

ఎవ్వరు ఇతడు? నేను ఎలా తెలుసు? ఈ పని నాకే ఎందుకు అప్పగించాడు? చాలా చిన్నపని. ఒక చిన్నపెట్టె తీసుకొని వెళ్లి మా ఊరిలో ఒకరికి ఇవ్వాలి – అంతే – ఆ పెట్టె పుచ్చుకోవలసినవాడు నాకు సుపరిచితుడే. మా నాన్నగారితో పని చేసేవాడు అతడు. కాని ఆ చిన్నపనికి ఇంత డబ్బు ఇచ్చాడెందుకు? డబ్బు అప్పే అని చెప్పాడని అనుకోండి అయినా...

నాన్నగారివద్ద చదువుకున్నాడట కదా! నాన్నగారికి డబ్బు అవసరమని కూడా తెలుసుకున్నాడు కదా! నాన్నగారికే ఇస్తే ఆత్మాభిమానంగల నాన్న తీసుకోరని నాకు ఇచ్చారా...? ఏమో...

అతడు నాకు అపరిచితుడు. ఇంత క్రితం ఒకసారైనా నాతో కనీసం ఫోనులోనైనా మాట్లాడినవాడు కాదు. ఒకసారి మాట్లాడివున్నా, గొంతు పోల్చగలను నేను.

ఏమీ తోచనిస్థితిలో బస్సు స్టాండులో నిలబడి వుండగా వచ్చింది అతని ఫోను.

"ఊరెళ్ళటం కోసం నిలబడ్డావు కదూ? డబ్బులు అందాయా."

ఉలిక్కిపడ్డాను. ఎవరు ఇతడు? నాకు డబ్బు కావాలని అప్పు పుట్టలేదని ఇతనికెలా తెలుసు?

"డబ్బు అందలేదని నాకు తెలుసు. బాధపడకు డబ్బు సాయం నేను చేస్తాను"

"ఎవ్వరు... ఎవ్వరు మీరు...?" కంగారుగా అడిగాను.

"కంగారుపడకు. నీకు కావలసిన వాడ్ని. మీ నాన్నకి రుణపడిన వాడ్ని..."

"మీ పేరు...?"

పేరు చెప్పాడు. కాని ఆ పేరుగల ఎవ్వరూ నాకు గుర్తురాలేదు.

"నువ్వు ఊరి నుంచి వచ్చాక అంతా చెబుతాను. ఆలోగా నువ్వు నాకో సహాయం చెయ్యాలి".

"ఏంటీ..."

"పెద్ద విషయం ఏం కాదులే... ఆ పుస్తకాల వైపు చూడు... అక్కడ ఒక ఆకుపచ్చని బ్రీఫుకేసు కనబడుతోందా?

"ఊఁ..."

"ఆ పెట్టెమీద ఒక లెదర్ బ్యాగుందా...?"

"ఊఁ..."

"ఆ హ్యాండు బ్యాగు జిప్పుతీసి చూడు. నీ ఊరికి టికెటు ఉంటుంది. సీటు నెంబర్ పదిహేను. ఇంచుమించు బస్సు మధ్య సీటు"

"హాండుబ్యాగులో డబ్బుకూడా ఉంది. పెట్టె చాలా జాగ్రత్త".

"అలాగే..."

"లెదర్‌బ్యాగులో మూడు లక్షలున్నాయి. మీ నాన్నగారి అదే మా మాస్టరిగారి ఆపరేషన్‌కి – సరిపోతుందా."

"ఎవ్వరు మీరు... ఇంత డబ్బు...

"మా మాస్టరుగారంటే అభిమానంతో ఇస్తున్నాను – అప్పుగానే... మీ నాన్నకి నేను ఎంతో రుణపడి వున్నాను శ్రీధర్".

శ్రీధర్! – అంటే నాపేరు కూడా తెలిసినవాడే. ఖచ్చితంగా నాన్నగారి శిష్యుడై వుండాలి.

"నువ్వు సీతానగరం రామారావు మాస్టరుగారి అబ్బాయేగా. నిన్ను కలుస్తానులే.

నిజంగా నేనే ఊరు బయలుదేరాను. పెట్టె మా వాడికి ఇచ్చి, మీ నాన్నని కలసి డబ్బులు ఇవ్వాలని. కాని ముఖ్యమైన పని పడింది. ఏంచెయ్యాలని ఆలోచిస్తూ వుండగా నువ్వు కనబడ్డావు టి.వి.స్క్రీనులో. అందుకే పెట్టె ఉంచి పుస్తకాలషాపువాడికి చెప్పివచ్చాను".

పుస్తకాల దుకాణం దగ్గరికి చేరుకున్నాను. ఎదురుగా కనబడింది బ్రీఫుకేసు నిండు గర్భిణి అలాంటిలెదరు బ్యాగు – బ్యాగు అందుకున్నాను. బ్రీఫుకేసు కూడా.

ఎవ్వరూ నన్ను పట్టించుకోలేదు. ఒకరినొక్కరు పట్టించుకోని నేటి సమాజానికి నిలువెత్తు ప్రతీక కదా బస్సుస్టాండు!

"జాగ్రత్త..." మళ్ళీ వచ్చింది అతని ఫోను. "బ్యాగు ఒడిలో పెట్టుకో. డబ్బు జాగ్రత్త. డబ్బు నీకు చాలా అవసరం.

నిజమే! ఇప్పుడు డబ్బు నాకు చాలా అవసరం. వారం రోజులుగా అప్పు గురించి తిరుగుతున్నాను. తెలిసినవారి వద్ద అప్పుపుట్టలేదు. వందా...వెయ్యా... ఏకంగా మూడులక్షలు. బాంకు వారు కూడా ఉన్నవారికే మరికొంత అప్పు ఇస్తారు కదా! పనిచేసే చోట, షావుకారు కూడా అప్పు అడుగుతే ఎగతాళి చేస్తున్నటు మాట్లాడాడు.

"ఎంత అడుగుతున్నావు...? లక్ష రూపాయిలే..." అతడు పకపకానవ్వాడు. "ఇస్తానులే. మూడేళ్ళు జీతం లేకుండా పనిచేస్తావా?"

అతని మాటల్లోని వెటకారం నాకు అర్థమైంది. నెలకి మూడువేలు జీతం నాది. కాని అవసరాలు, ఖర్చులు, జబ్బులు జీతం తెలుసుకొని రావు కదా!

మాది పేద కుటుంబం. కాని మా నాన్న తన పేదరికాన్ని అంగీకరించడు. మా తాతలు తాగిన నేతుల గురించి మాట్లాడుతూ వుంటాడు. అందువల్ల అర్హతవున్నా తెల్ల రేషను కార్డు కాని ఆరోగ్యశ్రీ కార్డు కాని సంపాదించలేదు. రోగానికి ధనిక పేదా తేడా లేదు కదా! సుఖాల్లో కన్నా కష్టాల్లోనే అండగా నిలిచే ఉత్తమ అర్ధాంగి అలా పేదవాళ్ళమైన మా ఇంటిలోనే తిష్ఠవేసి కూర్చుంది రోగం!

ఎవ్వరూ లేని చోటుకి వెళ్ళి బ్యాగు తెరిచిచూసాను. ఉంది – టికెటు ఉంది – డబ్బు కూడా.

బ్రీఫుకేసు అటూ ఇటూ తిప్పి చూసాను. పెట్టెలో ఏముంటుంది? తెరవటానికి ప్రయత్నం చేస్తూ వుంటే వచ్చింది ఫోను. అతనిదే!

"పెట్టె తెరిచిచూడటానికి ప్రయత్నిస్తావని నాకు తెలుసు. కాని పెట్టెది నెంబర్ లాకు! సమయం వృధా చెయ్యకు, బస్సెక్కు..."

విశాలమైన నగరవీధుల్లో పరిగెత్తింది బస్సు. మనసులో నిజంగా ఆప్యాయత లేకపోయినా, కనబడినప్పుడు ముఖానికి నవ్వులు పులుముకొని పలకరించే చుట్టంలా

ఉంది. హృదయంలో చీకటి నింపుకున్నా, నియాన్ దీపాల వెలుగు పులుముకొని అందంగా నవ్వే నగరం.

"కొద్దిగా తల అటు పెట్టుకుంటారా?" ఆ మాటలు విని వెనక తిరిగి చూసాను. పాపకు సినిమా కనబడటం లేదట..." వెనక సీటులో ఒక పాతికేళ్ళ అమ్మాయి ఒక అయిదేళ్ళ పాపని ఒడిలో నించో పెట్టుకోని ఉంది. బస్సులో సినిమా వేస్తున్నారు.

"అంకుల్... ఈ డాన్సు నాకు చాలా ఇష్టం" వెనక సీటు నుంచి నా ఒడిలోకి దూకుతూ అంది పాప.

సినిమాలో పులివేషంలో 'డాన్సు' చేస్తున్నారు. ఒకరిమీదొకరు పడి కరుస్తూ గాండ్రిస్తూ ఆడుతున్నారు.

"ఎంతో బాగా చేస్తున్నారు కదూ..." బస్సులో కొందరి మాటలు. అవును మరి! బాగానే చేస్తారు. ఎందుకంటే వాళ్ళు అభినయించటం లేదుగా!

"అంకుల్... అంకుల్... మేం అమ్మమ్మ ఇంటికి వెళ్తున్నాం తెలుసా...?" తన చిట్టిచేతులతో నన్ను తడుతూ అంది పాప.

"ఊఁ... డాన్సు చూడు..."

"డాన్సు అయిపోయిందిగా..."

తల యెత్తి చూసాను. ఏదో ప్రకటన వస్తోంది. బ్యాంకువారి ప్రకటన – ప్రకటనలో కనబడిన నోట్ల కట్టలు చూపిస్తూ అంది పాప "మా పెట్టెలో కూడా అలాంటి నోట్లకట్టలు ఉన్నాయి తెలుసా..."

"బుజ్జీ నువ్వు ఇలారా..." వెనకసీటునుంచి పాపతల్లి పిలిచింది. పాప పట్టించుకోలేదు.

"మా నాన్న డబ్బు– అమ్మమ్మకి డబ్బులేదట. అందుకే..."

"బుజ్జీ..." గట్టిగా పిలిచింది ఆమె.

"పాపని ఇలా ఇవ్వండి".

పాపని అందుకునేలోగా ఆమె సెల్‌ఫోను మ్రోగింది.

"బయలుదేరాను రా. బస్సులో ఉన్నాను" పలికింది ఆమె.

"..................."

"తెస్తున్నానురా. కావాల్సినంత తెస్తున్నాను. అయినా చాలా శ్రమపడవలసి వచ్చిందనుకో..."

".............."

"కంగారుపడక. తెల్లవారేసరికి అక్కడ ఉంటాను. 'ఆపరేషన్'కి రెడీ చెయ్యమని చెప్పు. అవునురా... అమ్మ మాట్లాడుతోందిరా..." ఆమె గొంతు జీరబోయింది.

నా హృదయం చలించింది. కష్టంలో ఉన్నవారిని చూస్తే నా మనసు కలత చెందుతుంది. పాపని అందుకుంది ఆమె.

బస్సు చీకటిలో సాగుతోందని అర్థమైంది. బస్సులో కొందరు నిద్రపోతున్నారు. మతపరమైన విషయాలు మాట్లాడి మాట్లాడి కొందరు తగువుకు దిగుతున్నారు. మరికొందరు రాజకీయ చర్చలో ఉన్నారు. బస్సు చుట్టూ చీకటి పొంచి ఉందని కాని, బస్సు ఏ దారిలో వెళ్తుందని కాని ఎవ్వరూ గమనించడం లేదు.

నా పక్క సీటువైపు చూసాను. అప్పుడు గమనించాను ఆ అమ్మాయిని. బస్సులోని మసక వెలుతురులో కూడా శ్రద్ధగా ఏదో చదివే అమ్మాయిని– బస్సులోని సినిమాగోల కాని మాటల హోరుగాని పట్టినట్టులేదు ఆ అమ్మాయికి.

"ఏం చదువుతున్నావు...?" అడిగాను.

"కాలేజీ పుస్తకం. నెలరోజుల్లో పరీక్షలు..."

"ఇంజినీరింగా...?"

"కాదు, మెడిసిన్ అంకుల్."

"ఎక్కడ..."

"సిటీలో. సెలవు ఇచ్చారని ఊరు వెళ్తున్నా..."

"చదువు అయిపోతోంది కదా? సిటీలో 'క్లినిక్' పెడతావా?"

"ఊహూ... మా ఊరిలోనే ప్రాక్టీసు చేస్తాను."

"మీ ఊరిలోనా... మీ ఊరు..."

"చిన్న పల్లె అంకుల్. నలుబది గడపలుంటాయి."

"మరీ..." నేను ఆశ్చర్యబోయాను.

"ప్రాక్టీసు డబ్బుకోసం కాదు అంకుల్. మా ఊరివాళ్ళకి వైద్య సహాయం అందించడం కోసం... మా అమ్మ... అమ్మకోసం..." అమ్మాయి చున్నితో కళ్ళు వత్తుకుంది. ఒక నిమిషం అట్లాగే ఉండిపోయింది. ఆ తరువాత మెల్లిగా అంది. "బాధ అనుభవించిన వారే ఇతరుల బాధ అర్థంచేసుకోగలరు, అంకుల్. అమ్మాయి గొంతు జీరబోయింది. నేను పుట్టగానే పోయింది అమ్మ. కాన్పు కష్టమైందట. ఊరులో డాక్టరు లేదు. హాస్పిటల్‌కి పదిహేనుమైళ్ళ దూరం. పైగా డబ్బు..." వెక్కివెక్కి ఏడ్చింది అమ్మాయి.

"మరీ మీ నాన్నా..."

"నాన్నని నేను చూడలేదు. అన్నయ్య చూసాడట. అమ్మ పోయాక నాన్న ఇంటికి

రాలేదు."

అమ్మాయివైపు ఆశ్చర్యంగా చూసాను.

"నిజమేనండి." అమ్మాయి మళ్ళీ అంది. "మేము బాగా బ్రతికినవాళ్ళమేనట! తాత చెబుతూ వుంటారు పదెకరాల మాగాణి..."

"మరీ...?"

"ఏదో పరిశ్రమకని భూమి స్వాధీనం చేసుకున్నారట పరిశ్రమ ఇంకా రాలేదు. మేము భూమి కోల్పోయాం".

"డబ్బులు ఇచ్చి వుంటారుగా..."

"ఇచ్చారట. కాని డబ్బులు ఉండిపోతాయా చెప్పండి. డబ్బులు కరిగిపోయాయి. చదువులేని తాత, నాన్న, కూలిపని తప్ప వేరే పనిచెయ్యలేరు. ఊరిలో పనిలేదు. ఆకలి భరించలేక కూలికోసం పట్నం వెళ్ళాడట నాన్న. అమ్మ ఉండేటప్పుడు ఇంటికి వస్తూ వుండేవాడట. ఆ తరువాత..."

"మరి నీ అన్నయ్య..."

"పనిలేక ఊరులో అలా తిరిగేవాడు. ఆకలి ముదిరినప్పుడు ఎవ్వరి డబ్బో కొట్టేసేవాడు. ఒకరోజు హఠాత్తుగా కనబడటం మానేసాడు." నా కళ్ళు నిండాయి.

"మొన్ననే చూసాను. వాడ్ని. కాదు కాదు వాడి ఫోటోని, టివిలో. వాడు ఇప్పుడు అన్నల్లో కలిసిపోయాడట" గట్టిగా నిట్టూర్చింది ఆ అమ్మాయి.

నిమిషాలు బరువుగా అడుగులు వేసి వెళ్ళాయి. మరీ ఆ అమ్మాయి చదువు - మెడిసిన్ చదువు అంటే ఖర్చుతో కూడిన చదువు కదా.

"ఊరు చదివిస్తోంది అంకుల్" ఆ మాట అడగగానే అమ్మాయి అంది.

"ఒకటి రెండు ఇళ్ళలో పనిచేస్తూ చదివేదాన్ని, బాగా చదువుతున్నానని ఊరివాళ్ళు తలో చెయ్యివేస్తున్నారు. ప్రభుత్వ సహాయం కూడా అందుతోంది"

బస్సులోని సినిమా మారింది. పౌరాణిక, సాంఘిక, భక్తి సినిమాల తరువాత ఇప్పుడు మృగం సినిమా వేస్తున్నారు. కక్ష తీర్చుకోవడమే జీవితలక్ష్యంగా భావించే మానవమృగాలు సృష్టించే మారణకాండలు చూస్తూ ఆస్వాదిస్తున్నారు ప్రయాణికులు.

హఠాత్తుగా సెల్‌ఫోను మ్రోగింది. అదే నెంబరు! అతడే!

"రెడిగా ఉండు. పది నిమిషాలల్లో రోడ్డు వారగా బస్సు ఆపి డ్రైవరు టీకి దిగుతాడు. హ్యాండు బ్యాగుతో నువ్వు దిగాలి".

"ఎందుకు...?"

"దిగాక చెబుతాను."

అతని మాటలు అర్థం చేసుకోలేకపోయాను. యాంత్రికంగా చేతులు హ్యాండు బ్యాగుని తడిమాయి. ఉంది. డబ్బు ఉంది. పొద్దునే ఇల్లు చేరుతే...

వస్తానని తెలుసు కనుక ఎదురుచూస్తూ వుంటుంది అమ్మ. నాకు ఇష్టమైన కాజా చేసి వుంటుంది. రాత్రి నిద్రపట్టక ఎర్రబారిన అమ్మ కళ్ళలో నన్ను చూడగానే ఉదయ సూర్యుడు ప్రకాశిస్తాడు అడుగు వెయ్యలేడు కాని, తెల్లవారకముందే లేచి బలవంతంగా చేతికర్ర సహాయంతో మెలమెల్లగా అడుగులువేసి గుమ్మం దాక వచ్చి చూసి వెళ్తు ఉంటాడు నాన్న.

నా కళ్ళు నిండాయి "వచ్చేస్తున్నాను, నాన్న వచ్చేస్తున్నాను" నా మనసు గొణిగింది.

బస్సు ఆగింది. దిగగానే వచ్చింది ఫోను.

"ఎవరెవ్వరు దిగారు, నువ్వు కాక."

"అయితే విను నీ వెనుక దట్టమైన అడవి కనబడుతోంది కదా. అక్కడికి జరిగి నిలబడు. నేను చెప్పే సెల్‌నెంబరు వ్రాసుకో... చేతిలో టార్చి ఉందిగా బస్సు బయలుదేరగానే ఆ నెంబరు నొక్కేసి పారిపో..."

"అంటే..."

"ఆ నెంబరు నొక్కగానే బస్సులోని పెట్టె పేలుతుంది. హా...హా...హా... అంది నా ప్లాను..."

నాకు ముచ్చెమటలు పోసాయి. కాళ్ళుచేతులు వణికాయి. అంటే నాకు డబ్బు ఎరగా వేసి...

హఠాత్తుగా నా ఒడిలో కూర్చుని సినిమా చూసిన పాప మనసులో కదిలింది. కల్లాకపటం ఎరగని ఆ చిన్నారి నవ్వు మనసంతా నిండింది. తల్లికోసం డబ్బు తీసుకొని వెళ్ళే అమ్మాయి– ఆ అమ్మాయి కోసం ఎదురుచూసే తల్లి ముఖం– నా మనసులో సినిమా రీలులా కదిలింది. నెరిసిన జుట్టుతో, కళ్ళ చుట్టూ నల్లని వలయాలతో మోకాళ్ళ నొప్పితో జీవిత వ్యథలకు ప్రతిబింబంగా కదిలే ఆ రూపం నా తల్లిది కూడా కదా!

సెల్‌ఫోను మ్రోగింది. అదే నెంబరు, అతడే! ఫోను ఎత్తలేదు.

బస్సులో నా పక్క సీటులో పుస్తకం చదువుతూ కూర్చున్న అమ్మాయి – సమాజపు ఆశాజ్యోతి – ఒక నవసమాజానికి రేపటి తరానికి ఊపిరి పొయ్యడం కోసం తపించే అమ్మాయి –

బస్సులోని అరువది ముఖాలు నా కళ్ళ ముందు కదిలాయి. ప్రతి ఒక్కరి గురించి అత్రుతగా ఎదురుచూసే అయినవాళ్ళ ముఖాలు– వీళ్ళని చూడగానే ఆనందంతో వెలిగేవాళ్ళ ముఖాలు– నెంబరు నొక్కుతే...

పోయేది బస్సులో ఉన్నవారి ఊపిరికాదు, ఒక ఎదిగే సమాజపు ఊపిరి.

సెల్ మ్రోగుతూనే ఉంది.

నేను నెంబరు నొక్కకపోతే...

ఆ పని అతడే చేస్తాడేమో...?

నా సెల్ ఆపు చేసాను. పరుగెత్తుకుని వెళ్ళి బస్సు ఎక్కాను.

బస్సు కదులుతోంది. వెంటనే బ్రీఫుకేసుతో బస్సు నుంచి దూకాను.

బ్రీఫుకేసుతో పరిగెత్తాను. అతడు ఏ నిమిషంలోనైనా సెల్ నెంబరు నొక్కవచ్చు. .. పెట్టె ప్రేలిపోవచ్చు. పెట్టెతోపాటు నేనూ... మరి మా నాన్న... నాకు భయం అనిపించ లేదు.

పదిమంది బాగు కోసం ప్రాణత్యాగం చేసే గొప్ప సంస్కృతికి వారసుడిని నేను.

***